క్లుప్తంగా

నేటి నుంచి అంబలి పంపిణీ

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలో ప్రతీ వేసవిలో అందిస్తున్నట్లే ఈసారి కూడా బాటసారులు, ప్రయాణికులకు శుక్రవారం నుంచి అంబలి పంపిణీ చేస్తామని పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టరేట్ పక్కన ఐబీ ఎదుట అంబలి కేంద్రాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

కుభీర్: మండలంలోని మాలేగాం గ్రామంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణకళ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన గ్రామపంచాయతీల కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు.

కంటివెలుగు పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని తొమ్మిదో వార్డు పరిధిలో జరుగుతున్న కంటివెలుగు శిబిరాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరానికి వస్తున్నవారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, పలువురు సిబ్బంది ఉన్నారు.

లీకేజీకి మరమ్మతులు



మరమ్మతు చేయిస్తున్న అధికారి

సాక్షి ఎఫెక్ట్..

జిల్లా కేంద్రంలోని శాస్త్రీనగర్ నుంచి గొల్లపేట్ వెళ్లే మార్గంలో మంచి నీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో ఈనెల 6న సాక్షిలో వృథాగా భగీరథ జలం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఆలయాభివృద్ధికి చేయూత

దస్తురాబాద్: మండలంలోని మున్యాల గ్రామంలో హనుమాన్ ఆలయాభివృద్ధి కోసం గురువారం ఇదే మండలంలోని గొడిసీర్యాలలోని గోండుగూడకు చెందిన నాగుస్వామి రూ.20వేలను అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో నష్టం



రాలిన మామిడి కాయలను ఏరుతున్న రైతు

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్, రేవోజీపేట, గొడిసీర్యాల, బుత్కూర్, మున్యాల గ్రామాల్లో గురువారం ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షానికి వరి, మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రేవోజీపేటలో తనకున్న 15 ఎకరాల తోటలో మామిడి కాయలు రాలిపోయాయని రమేశ్‌రెడ్డి వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

వీఓఏల సమస్యలు పరిష్కరించండి

మామడ: ప్రభుత్వం వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు, ఆరోగ్యబీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏల సంఘం గౌరవ అధ్యక్షుడు పోతన్న అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేశ్‌కు వినతిపత్రం అందించారు. గ్రామసంఘాలకు సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న వీఓఏలకు సెర్ప్ నుంచి గుర్తింపుకార్డు అందించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు రజిత, మౌనిక, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం గురువారం ముగిసింది. ఉదయం నిర్వహించిన కాళ్యకీర్తనలో నాందేడ్ జిల్లాకు చెందిన నర్సింగ్ మహరాజ్ పాల్గొని ప్రవచనాలు చెప్పారు. ప్రస్తుత సమాజంలో ఆధ్యాత్మిక ఆలోచనలతో ప్రశాంతంగా ఉండవచ్చన్నారు. పలువురు తులసీమాలలు ధరించగా ఉట్టి పగులగొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారం రోజులుగా వేడుకలో పాల్గొన్న మహరాజ్‌లను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సప్తాహం కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం

కుంటాల: కుంటాల ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హన్మాండ్లును గురువారం బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో కలిసి సన్మానించారు. పార్టీ మండల కన్వీనర్ దత్తాద్రి, ఎంపీటీసీ మధుకర్, కోశాధికారి కక్కెర ముత్యంరావు, ఖదీర్, గజేందర్, ఏఎస్సై దేవరావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయా ఆశీర్వదించు

- ఊరూరా హనుమాన్ జయంతి
- వీధుల్లో భక్తుల శోభాయాత్ర
- కిటకిటలాడిన ఆలయాలు



కుంటాలలో శోభాయాత్ర చేస్తున్న దీక్షాపరులు, భక్తులు

భైంసారూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లాలోని ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీక్షాపరులు, భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. పలు చోట్ల రైతులు తమ చేన్లలో పనులు ప్రారంభించారు. భైంసా మండలంలోని లింగా, దేగాం, ఇలేగాం, వానల్‌పాడ్, వాటోలి, సిద్దూర్, మిర్జాపూర్, మాంజ్రి, టాక్లి, మహాగాం తదితర గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేయగా దీక్షాపరులు వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.

తానూరు: మండలంలోని తానూరు, హింగిర్గా, బెంబర, బోల్సా గ్రామాల్లోని ఆలయాల వద్ద పూజల అనంతరం దీక్షాపరులు కొండగట్టుకు వెళ్లారు.

భైంసాటౌన్: పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పులేనగర్ హనుమాన్ ఆలయంతోపాటు కిసాన్‌గల్లి, భట్టిగల్లి, పిప్రి కాలనీ కాలనీల్లోని ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. కమలాపూర్ గుట్ట హనుమాన్ ఆలయంలో దక్షిణముఖ ఆంజేయస్వామిని దర్శించుకున్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు, కుంటాల, ఓలా, వెంకూర్, అందాకూర్, లింబా(కే), అంబకంటి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. కుంటాలలో గురుస్వామి భుజంగం గణపతి ఆధ్వర్యంలో శ్రీరామాంజనేయ స్వామి శోభాయాత్ర నిర్వహించారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రసన్నాంజనేయ ఆలయంతో పాటు మండలంలోని గోసంపల్లె, బీర్నంది, గోడలపంపు, గాంధీనగర్, శాంతినగర్ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు జరిగాయి. పలుచోట్ల ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొన్నారు. వేదపండితులు చక్రపాణి వాసుదేవాచార్యులు, అర్చకులు సందీప్‌శర్మ పూజలు చేశారు.

ఘనంగా పల్లకిసేవ

ఖానాపూర్‌లోని శ్రీ పసన్నాంజనేయ ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా హనుమాన్ పల్లకిసేవ శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో పాల్గొన్నారు. అడ్డగట్ల రాజన్న, రాజశేఖర్, రమేశ్, సత్యం, గంగనర్సయ్య ఉన్నారు.

కడెం: మండలంలోని పాండ్వపూర్ హనుమాన్ ఆలయంలో అర్చకులు నరేష్, సందీప్ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని వీరహనుమాన్, బోయవాడ హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. వీరహనుమాన్ ఆలయంలో దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోరా, గొడిసెర, వట్టోలి, మన్మద్, రాజూరా, గడ్‌చాంద, లోకేశ్వరంలో శోభాయాత్ర నిర్వహించారు.

కుభీర్: మండలంలో రైతులు చేన్లలో పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు. దాదాపు అన్ని గ్రామాల్లో మహాదేవుడి జెండా ఎగురవేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామాల్లో అన్నదానం చేశారు.

సారంగపూర్: మండలంలోని జామ్, స్వర్ణ, ఆలూరు, ధని, బోరిగాం, బీరవెల్లి, సారంగాపూర్, కౌట్ల(బి), చించోలి(బి) నుంచి దీక్షాపరులు పాదయాత్రగా కొండగట్టుకు వెళ్లారు.



లోకేశ్వరం: ధర్మోరాలో హనుమాన్ శోభాయాత్ర



భైంసాలోని హనుమాన్ ఆలయంలో..



కుభీర్ హనుమాన్ మందిరంలో..



ఖానాపూర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో



భైంసారూరల్: లింగాలో పూజలు చేస్తున్న భక్తులు



నర్సాపూర్(జి): సత్యనారాయణ వ్రతంలో భక్తులు

అటెన్షన్ ప్లీజ్.. ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి



లోకేశ్వరం: మండల కేంద్రంలో మందుల పోశెట్టి ఇంటి ముందు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరించడంతో ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందే ఎత్తులో ఉంది. దీంతో ప్రమాదం జరగకమందే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శివకుమార్, విద్యుత్ ఏఈ, లోకేశ్వరం, ఫోన్: 94408 11710

లక్ష్మణచాందను చుట్టేసిన కలెక్టర్

- మండలంలో విస్తృత పర్యటన



మండలకేంద్రంలోని కేజీబీవీలో భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. పొట్టపెల్లి(కే) గ్రామానికి మొదట వెళ్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. స్టాక్ రూంలో సరుకులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. వారితో పాటలు పాడించారు. బోర్డుపై చార్టులో ఏం ఉన్నాయని అడుగగా చిన్నారులు చకచకా సమాధానం చెప్పారు. అనంతరం గ్రామ పంచాయతీ, పల్లె ప్రకృతివనం, నర్సరీ, కిచెన్‌గార్డెన్, తెలంగాణ క్రీడా ప్రాంగణం పరిశీలించారు. నర్సరీలో డిమాండ్‌కు అనుగుణంగా మొక్కలు పెంచాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలు కలిగిన భోజనం అందించాలని అధికారులకు సూచించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఈనెల 12 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయని, బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులతో బోర్డుపై మ్యాప్ వేయించారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలియతిరిగారు. ప్లాంటేషన్ బాగా లేదని బోర్డర్ ప్లాంటేషన్ చేయాలని, ఉపాధి హామీ పథకంలో మరుగుదొడ్లు, ఇతర పనులు చేయించుకోవాలని ఎస్‌వో నవితను ఆదేశించారు. అనంతరం చింతల్‌చాంద గ్రామంలో క్రిమిటోరియం, సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించారు. సేంద్రియ ఎరువుల తయారీ గురించి తెలుసుకున్నారు. అనంతరం చామన్‌పెల్లి గ్రామంలో రైతు శ్రీనివాస్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పాం పంటను పరిశీలించారు. ఆయిల్‌పాంలో అంతర పంటలు వేసుకోవాలని సూచించారు. తర్వాత పార్‌పెల్లిలో కంటివెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగు పరీక్షలు ఎంత మంది చేయించుకున్నారో రిజిస్టర్ పరిశీలించారు. కంటి చూపునకు సరిపోయే రీడింగ్ అద్దాలను అవసరమైన మేరకు అందించాలన్నారు. కలెక్టర్ వెంట ప్రత్యేక అధికారి శ్యామ్‌రావు రాథోడ్, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, సర్పంచులు హైమావతి, ముత్యంరెడ్డి, రాజామణి, రాజేందర్, వైద్యులు శ్రీకాంత్, శ్వేత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు మందపల్లి గ్రామంలో చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్‌లు పూర్ణచందర్‌గౌడ్, సుధాకర్, మహేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి మాజీ సర్పంచ్ సుంకరి నర్సయ్య, వార్డు సభ్యుడు సుంకరి శివకు ఇటీవల మాతృవియోగం కావడంతో గురువారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రేఖానాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి కారణాలను తెలుసుకున్నారు. వారి వెంట దామెర శ్రీనివాస్, మల్లేశ్, తిరుమల్, తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జన్నారం మండల కేంద్రంలో ఈనెల 8న నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాలు–2023 పోస్టర్‌ను ఎమ్మెల్యే రేఖానాయక్ పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజగంగన్న, చరణ్, గజేందర్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

గురుకులంలో సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫాం



వేదికపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సారంగపూర్: మండలంలోని జామ్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో షీటీమ్ ప్రతినిధి రాధిక ఆధ్వర్యంలో సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫాం(సీఏపీ) సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా రాధిక, పాఠశాల ప్రిన్సిపాల్ రమాకల్యాణి మాట్లాడుతూ ప్రతీరోజు వార్తల్లో, సామాజిక మాధ్యమాల్లో సైబర్ నేరాల తీవ్రత చూస్తున్నామని తెలిపారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాం. మీఖాతాకు కేవైసీ చేయలేదని సమాచారం తస్కరించి మన బ్యాంకు ఖాతాల్లో డబ్బులను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి భద్రత అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ విద్యార్థి తప్పకుండా సైబర్ నేరాలను నియంత్రించడానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఇళ్లకు వెళ్లాక సైబర్ నేరాలపై తల్లిదండ్రులు, బంధువులకు అవగాహన కల్పించాలని సూచించారు. షీటీమ్, చైల్డ్ హెల్ప్‌లైన్, మహిళల భద్రత, సైబర్ నేరాలపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకునేలా ప్రతీరోజు పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తరగతులు నిర్వహించడానికి ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులకు ముందుగానే శిక్షణ ఇచ్చారన్నారు. ఈతరగతుల్లో తెలుసుకున్న అంశాలను సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఉపయోగించాలని సూచించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 అనే టోల్‌ఫ్రీ, లేదా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాల సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫాం ఉపాధ్యాయులు ప్రవీణ, ప్రవల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: కూలీలందరికీ ఉపాధి పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కుంబి, ఇలేగాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి మాట్లాడారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో జాబ్‌కార్డు లేనివారు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. పొలాల్లో ఉపయోగపడే పనులను రైతులు అధికారుల దృష్టికి తీసుకొస్తే మంజూరయ్యేలా చూస్తామన్నారు. కోఆప్షన్ సభ్యులు గజానంద్, ఏపీఓ శివలింగం, కూలీలు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: అర్హులందరికీ జాబ్‌కార్డులు అందిస్తామని.. కూలీలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని మన్మద్ సర్పంచ్ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మన్మద్ గ్రామంలోని దేవుని చెరువులో ఉపాధిహామీ పనులను సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. బాయమొల్ల భోజన్న, పలువురు కూలీలు ఉన్నారు.

ఊరూరా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



నిర్మల్‌లో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



లక్ష్మణచాందలో జెండా ఆవిష్కరణ



లోకేశ్వరం: రాజూరాలో బీజేపీ నాయకులు



కడెంలో బీజేపీ నాయకుల వేడుకలు

ఖానాపూర్: జిల్లావ్యాప్తంగా గురువారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తాలో పార్టీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోశ్, మండలంలోని గోసంపల్లెలో మండలాధ్యక్షుడు టేకు ప్రకాశ్ జెండా ఆవిష్కరించారు. పెంబి జెడ్పీటీసీ జానుబాయి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్, నర్సాగౌడ్, శ్రీనివాస్, బుచ్చన్న, కిషన్, మహేందర్, ఆనంద్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు కిష్టయ్య ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, కార్యదర్శి కృష్ణ, గంగాధర్, రవీందర్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద, పొట్టపెల్లి, రాచాపూర్, వడ్యాల్ వంటి గ్రామాల్లో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఇందులో ఉపాధ్యక్షుడు రంజిత్, ముత్తన్న, రాజు, అశోక్, ప్రవీణ్, పోశెట్టి పాల్గొన్నారు.

సోన్ మండలంలోని సోన్, న్యూవెల్మల్, మాదాపూర్,క డ్వాల్, బొప్పారం, పాక్‌పట్ల గ్రామాల్లో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. దళిత మోర్చా జిలల్లా అధ్యక్షుడు సాగర్, నరేశ్, నారాయణ, అశోక్, మహేందర్, మల్లేశ్, నవీన్ పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ జెండా ఆవిష్కరణ చేశారు . కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, మల్లికార్జునరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అర్జున్, ప్రధాన కార్యదర్శి నరేష్, అంజుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో నిర్వహించిన బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో మండలాధ్యక్షుడు కరిపె విలాస్, మహేందర్, సోషల్ మీడియా కన్వీనర్ తిరుమలచారి, బూత్ అధ్యక్షులు నవీన్, సుకేష్, ధన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంతోపాటు రాంపూర్, కుస్లీ గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, మండలాధ్యక్షుడు ఠాకూర్ అర్జున్ సింగ్, నరేందర్, శేఖర్, ప్రతాప్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ, వాజ్‌పేయి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నల్ల రమేశ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు అనిల్, రాజు, అశోక్, నరేశ్, రవి, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పలువురు మహిళలు సాయిరాం నామస్మరణ చేస్తూ ఆలయానికి పాదయాత్రగా వచ్చారు. సాయిబాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

కుంటాల: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి పేర్కొన్నారు. గురువారం కుంటాల మండలంలోని కల్లూరులో రమాకాంత్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రజినీకాంత్, లక్ష్మణ్‌పటేల్, పసుల నవీన్, రమణగౌడ్, గుద్దేటి నర్సయ్య, రాజేందర్‌రెడ్డి, ముత్యం, రవి తదితరులు పాల్గొన్నారు.

ధర్మోరలో..

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామ బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ మంద శారద ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, నర్సయ్య, గౌడ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, మున్నూరుకాపు సంఘం గ్రామ అధ్యక్షుడు మంద గణేశ్, భోజన్న, భాస్కర్, సునీల్‌రెడ్డి, ఈరన్న, పోశెట్టి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

బలగం ప్రదర్శన

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం బలగం సినిమాను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఆత్మీయత, బంధాలను తెలిపే చిత్రం కావడంతో గ్రామస్తులు తరలివచ్చి వీక్షించారు.

కుంటాలలో..

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయ ఆవరణలో ప్రదర్శించిన బలగం సినిమాకు స్పందన లభించింది. సినిమా ఏర్పాటు చేసిన మేసినేని వెంగల్‌రావు, శ్రావణ్‌కుమార్, జుట్టు వెంకటిని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకట్రావు, కృష్ణారావు, శివ, సాయన్న, గజ్జన్‌రావు, భూమన్న, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

'ఒక్కసారి బీజేపీకి అవకాశమివ్వండి '

ఖానాపూర్: రాష్ట్రంలో ఒక్కసారి బీజేపీ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని పెంబి జెడ్పీటీసీ జానుబాయి, ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్ అన్నారు. బీసీలకు చేకూర్చిన ప్రయోజనాలను వివరించేందుకు చేపట్టిన పల్లె పల్లెకు ఓబీసీ– ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం జయప్రదం చేయాలని వారు కోరారు. గురువారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని దుకాణాలు, నివాసాలు తిరుగుతూ ఓబీసీ మోర్చా కరపత్రాలు పంపిణీ చేశారు. అంతకముందు విశ్రాంతి భవనంలో పోస్టర్ ఆవిష్కరించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయిని సంతోష్, గోస్కుల మల్లేశ్, దొనకంటి స్వామి, పెట్టం చంద్రశేఖర్, రాజన్న, మహేందర్, సురేందర్, రాము, తదితరులు ఉన్నారు.